క్లుప్తంగా

ప్రమాదకరంగా విద్యుత్ బుడ్డీలు



మాగనూర్: మండల పరిధిలోని నెరడగం గ్రామంలోని వర్కూర్ గ్రామంకు వెళ్లు దారిలో విద్యుత్ బుడ్డీలు ప్రమాదకరంగా ఉన్నాయని గ్రామ ప్రజలు అంటున్నారు. ప్రధాన రహదారి వెంబడి ఉండటంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

జన సమీకరణకు సన్నాహం



మరికల్: మంత్రి కేటీఆర్ ఈ నెల 24న నారాయణపేట జిల్లా కేంద్రానికి వస్తున్న సందర్భంగా భారీగా జన సమీకరణ చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మేరకు శనివారం మండల పార్టీ అధ్యక్షులు లంబడి తిరుపతయ్య, ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి మరికల్‌లో ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో పలు సూచనలు చేశారు. సభకు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. సర్పంచ్ గోవర్ధన్, కృష్ణయ్య, కొండారెడ్డి, రాజేష్, శివ, పుల్లయ్యగౌడ్, రామకృష్ణారెడ్డి, నర్సిములు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణ వాల్‌పోస్టర్ విడుదల



మక్తల్: బీఆర్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణను 26వ తేదిన చేపట్టనున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన పోస్టర్‌లను పునఃస్థాపన కమిటీ సభ్యులు శనివారం విడుదల చేశారు. కార్యక్రమానికి మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, తెలంగాణ గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మెన్ సాయిచంద్, ప్రొఫెసర్ కాశీం, బీఎస్పీ మాజీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కోరి మారెప్ప, దత్తాత్రేయ తదితరులు హాజరవుతారని అన్నారు. కార్యక్రమంలో పృథ్వీరాజ్, నారాయణ, అంజప్ప, పోలప్ప, ప్రకాష్, రవికుమార్, హైమవతి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మాగనూర్: అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ, భీమ్ ర్యాలీ, బహిరంగ సభ గోడపత్రికను శనివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేఎస్‌పీఎస్ జిల్లా నాయకులు కృష్ణయ్య బీఎస్పీ పార్టీ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు కోరి మారెప్పలు మాట్లాడారు. నాయకులు దత్తాత్రేయ, నారాయణ, అంజప్ప, సగరం రమేష్, వెంకటయ్య పాల్గొన్నారు.

గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించాలి

కోయిల్‌కొండ: మండలంలోని గార్లపహాడ్ పరిసర గ్రామాలను అనుసంధానం చేస్తూ నూతన మండలంగా ప్రకటించాలని జేఏసీ నాయకులు రామునాయక్, వెంకట్రామిరెడ్డిలు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని కేశ్వాపూర్, పేర్కివీడు గ్రామాల ప్రజలతో నూతన మండల ఏర్పాటుపై సమావేశం నిర్వహించారు. గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించాలని కేశ్వాపూర్ సర్పంచ్ మెగులయ్య, పేర్కివీడు సర్పంచ్ రాఘవేందర్‌రెడ్డిలతో పాటు ఆయా గ్రామాల ప్రజలు సంపూర్ణ మద్దతు పలికారని వారు కోరారు. కార్యక్రమంలో నాయకులు నవీన్, ఆంజనేయులు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామకొండపై ప్రత్యేక పూజలు

కోయిల్‌కొండ: మండలంలో ప్రసిద్ధి చెందిన శ్రీరామకొండ క్షేత్రంలో శనివారం పుష్యమాస అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు రాఘవేందర్‌రావు తెలిపారు. ఉదయం స్వామివారిని ప్రత్యేక పూలతో అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించినట్లు ఆయన తెలిపారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

దేవరకద్ర: చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సూచించారు. శనివారం దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలోని వీరప్పయ్యస్వామి దేవస్థానం గ్రౌండ్‌లో దేవరకద్ర ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ రమాదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు అన్నపూర్ణ, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు జట్టి నర్సింహారెడ్డి, నాయకులు వెంకటేష్, శ్రీకాంత్‌యాదవ్, కొండ శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, శివానంద్, బాల్‌రాజు, చల్మారెడ్డి, రంగయ్యగౌడ్, వెంకట్రాములు, ఆంజనేయులు, శంకర్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

కాలనీల దారులు ధ్వంసం

- భగీరథ పనుల కోసం తవ్విన గుంతలు
- నెలలు గడుస్తున్నా పూర్తికాని పనులు
- రోడ్లపైనే నల్లాకనెక్షన్‌లు
- ఇబ్బందులు పడుతున్న కాలనీల ప్రజలు
- పట్టించుకోని అధికారులు



పట్టణంలోని హరిజనవాడ కాలనీలో రోడ్ల పై భగీరథ కనెక్షన్‌లు



హజిఖాన్‌పేటలో అడ్డంగా తవ్వి వదిలేసిన రోడ్డు

దశలవారీగా పరిష్కరిస్తున్నాం

> పట్టణంలో కొన్ని చోట్ల గుంతలు తవ్వినా పైపులు వేసి ఇంటింటి నల్లా కనెక్షన్ పనులు పూర్తి అయిన తర్వాత పంక్చర్ ఉన్న వాటికి మరమ్మతులు చేయిస్తున్నాం. అన్ని కాలనీలలో దశలవారీగా సమస్యలు పరిష్కరిస్తున్నాం. త్వరలోనే అన్నిచోట్లా పూర్తిచేస్తాం.
>
> – సునీత, మున్సిపల్ కమిషనర్, నారాయణపేట

నారాయణపేట టౌన్ : పట్టణంలో పలు కాలనీలలో మిషన్ భగీరథ పనుల కారణంగా సీసీ రోడ్లు తవ్వి వదిలేశారు. కొనిచోట్ల పైపులు వేసినా మట్టి, కంకరతో మూసి వదిలివేశారు. రోడ్లు ధ్వంసం కావడం, ఇష్టానుసారం తవ్వి వదిలి వేయడంతో రాకపోకలు సాగించడానికి కాలనీల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా హజిఖాన్‌పేట, కుర్వగేరి, సింగార్‌బేస్ కాలనీలో పరిస్థితులు ఇబ్బంది కరంగా ఉన్నాయి. హజిఖాన్‌పేట వీధిలో రోడ్డు మధ్యలో తవ్వి వదిలివేయడంతో రెండు, మూడు నెలల నుంచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదే విధంగా ఎస్సీ కాలనీలో ఇంటింటికి వచ్చే నల్లా కనెక్షన్లు రోడ్లపై అందించి వదిలేశారని స్థానికులు వాపోతున్నారు. మరి కొన్ని చోట్ల నల్లా కనెక్షన్లు ఇచ్చినప్పటికీ నీరు సరఫరా అయ్యే సమయంలో పైపులు లీకేజీ అవుతున్నా ఎవరు పట్టించుకోవడం లేదంటున్నారు. సింగార్ బేస్ నుంచి సివిల్‌లైన్, హజిఖాన్‌పేట, కుర్వగేరి, బురుదువాడి కాలనీలలో కంకర తేలిన రోడ్లు, గుంతలమయంగా ఉన్న రోడ్లతో ఇబ్బందులు పడుతున్నామని ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

‘విద్యార్థులకు చేయూతనందిస్తాం’



నర్వలో పదోతరగతి విద్యార్థులకు స్టడీమెటీరియల్‌ను అందిస్తున్న వర్కటం జగన్నాథ్‌రెడ్డి

నర్వ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న నిరుపేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ఎల్లప్పుడూ చేయుతనందిస్తామని బీఆర్ఎస్ రాష్ట్రనాయకులు, వీజేఆర్ ఫౌండేషన్ అధినేత వర్కటం జగన్నాథ్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల, పాథర్చేడ్ ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థులకు స్టడీమెటీరియల్‌ను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యాశాఖ ఇటీవల తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా నిపుణులతో మెటీరియల్ తయారు చేయించామన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ యువకులు నర్సిములు, గోవర్ధన్, బొజ్జన్న, హెచ్‌ఎం రాజేష్‌కుమార్, ఉపాధ్యాయులు చెన్నయ్య, గోవిందు, రమాదేవి, రఘు, ప్రకాష్, నర్సింహారెడ్డి, పాఠశాల ఎస్ఎంసీ చైర్మెన్ రఫీ, వైస్ చైర్మెన్ పరమేశ్వరి, మధు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ‘కంటివెలుగు’



మక్తల్: పట్టణంలో కంటివెలుగు కార్యక్రమం కొనసాగుతోంది. శనివారం 140 మందికి పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు, కంటి అద్దాలను అందజేశారు. కార్యక్రమంలో శోభారాణి, కంటి వైద్యులు శంకర్, ఎఎన్ఎంలు శశికళ, సత్యనారాయణమ్మ, ఆశావర్కర్లు జయమ్మ, ఆశమ్మ, సుజాత, పద్మ , అనిత, మంజుల, అనంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

28 నుంచి బ్రహ్మోత్సవాలు

మరికల్: ఎక్లాస్‌పూర్ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 28 నుంచి నిర్వహిస్తున్నట్లు పూజారి శివుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 6 వరకు జరిగే ఉత్సవాల కోసం అన్ని ఏర్పాట్లు చేయడంతో పాటు, ఆలయం ముస్తాబు చేశామన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనిఆ ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు.

25న సర్వసభ్య సమావేశం

నారాయణపేట రూరల్ : మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 25న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ అమ్మకోళ్ల శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి హాజరవుతున్నట్లు చెప్పారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, మండల స్థాయి అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

మాగనూర్: మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 25న ఎంపీపీ శ్యామలమ్మ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి హాజరవుతారని అందులో పేర్కొన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు సకాలంలో సమావేశానికి హాజరుకావాలని కోరారు.

ఆధార్ సీడింగ్‌పై దృష్టి సారించండి

అమరచింత: ఓటు హక్కు కలిగిన వారి ఇళ్లకు వెళ్లి ఓటరు కార్డుకు ఆధార్ సీడింగ్ చేపట్టాలని బీఎల్ఓలకు తహసీల్దార్ చాంద్‌పాషా ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలో శనివారం మండలంలోని ఆయా గ్రామాల బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ఓటరు లిస్టు వివరాలకు ఆధార్ సీడింగ్ కావడం లేదని బీఎల్‌ఓలు వీటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వారం రోజుల్లోగా పూర్తి స్థాయిలో ఓటు కలిగిన వ్యక్తి ఆధార్‌ను సీడింగ్ చేయాలని సూచించారు.

బాధితులకు ఆర్థిక సాయం

మహమ్మదాబాద్: మండల పరిధిలోని జూలపల్లిలో శుక్రవారం రాత్రి ప్రమాదవశాత్తు గుడిసెలు కాలిపోవడంతో వారికి డీసీసీబీ చైర్మన్ బి. మనోహర్‌రెడ్డి ఆర్థిక సహాయం అందించారు. వివరాల ప్రకారం.. వడ్డె వెంకట్రాములు, వడ్డె వెంకటమ్మ, వడ్డె రాములు పొలాల దగ్గర గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారు. శుక్రవారం రాత్రి ప్రమాదవశాత్తు ఒక్క గుడిసెకు నిప్పు అంటుకుంది. అయితే ముగ్గురి గుడిసెలు దగ్గర దగ్గర ఉండటంతో వారి గుడిసెలు కూడా అంటుకున్నాయి. గుడిసెల్లో ఉన్న వంటసామగ్రి, దుస్తులు కాలి బూడిదయ్యాయి. సర్పంచ్ కిరణ్ వారికి బియ్యం సహాయం చేయగా డీసీసీబీ చైర్మన్ ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున ఆర్థిక సహాయం అందించారు.

రోడ్డు పనులు ప్రారంభం

అమరచింత: ధర్మాపురంలో సీసీ రోడ్డు పనులకు శనివారం మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు ప్రారంభించారు. జిల్లా పర్యటకు వచ్చిన సీఎం కేసీఆర్ జిల్లాలోని ఒక్కో పంచాయతీకి రూ.20 లక్షల నిధులు అందించారు. దీంతో ధర్మాపురంలో అంతర్గతంగా సీసీ రహదారులు వేస్తున్నట్లు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణనే ధ్యేయం



మాట్లాడుతున్న శ్రీనివాస్

మహబూబ్‌నగర్ రూరల్: మాదిగల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ఎస్సీ వర్గీకరణనే ధ్యేయంగా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తున్నామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లెపోగు శ్రీనివాస్ అన్నారు. పాలకులకు మాదిగ, మాదిగ ఉప కులాల ప్రజల అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదని అన్నారు. శనివారం స్థానిక టీఎన్జీఓ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాదిగల ఓట్లతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలకు, మాదిగల సంక్షేమాన్ని విస్మరిస్తే ఏమి జరుగుతుందో రాబోయే ఎన్నికల్లో ఓటే ప్రధాన ఆయుధంగా పనిచేసి, మాదిగలను విస్మరించిన ప్రభుత్వాలకు ఓటు ద్వారానే గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. మాదిగలకు చేయూతనిచ్చే పార్టీలకే మాదిగల మద్దతు ఉంటుందని అన్నారు. మాదిగల అభివృద్ధి కోసం కేటాయించిన నిధులను మాదిగల అభివృద్ధికి ఉపయోగించకుండా ఇతర పథకాలకు వాడుతున్నారని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఇంకా రెండు నెలలు పూర్తయితే రెండో విడత దళితబంధు నిధులు దళితులకు అందకుండా పోతుందని అన్నారు. కావున సీఎం కేసీఆర్ వెంటనే రెండో విడత దళితబంధు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 23న ఎమ్మార్పీఎస్ జిల్లా స్థాయి సదస్సు ఉంటుందని, ఈ సదస్సుకు రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్, జాతీయ అధ్యక్షుడు మేడి పాపయ్యలు హాజరవుతున్నారని తెలిపారు. సమావేశంలో నాయకులు జయన్న, చెన్నయ్య, నాగరాజు, అనంతయ్య, చెన్నప్ప, నర్సిములు, సాయికుమార్, కృష్ణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



గూడెబల్లూర్‌లో ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్న అర్చకులు



మక్తల్‌లో పూజలు చేస్తున్న భక్తులు



గోపాల కార్యక్రమం నిర్వహిస్తున్న భక్తులు

మక్తల్: అమవాస్య సందర్భంగా మక్తల్ పట్టణంలో శ్రీపడమటి అంజనేయస్వామి, ఉమమాహేశ్వరాలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమం చేపట్టారు. నరేందర్, నాగరత్నం, లక్ష్మీనారాయణ సాయిరాం, మల్లారెడ్డి, వాకిటి శేషగిరి, కొండయ్య పాల్గొన్నారు.

కృష్ణా: మండలంలోని చేగుంట పార్వతి పరమేశ్వర ఆలయంతో పాటూ మండల కేంద్రంలోని క్షీరాలింగేశ్వర ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గూడెబల్లూర్‌లోని స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర ఆలయంలో పురందర దాస ఆరాధనోత్సవాలను నిర్వహించారు. గ్రామానికి చెందిన ప్రముఖ చిత్ర కళాకారుడు చిదానంద్ స్వతహాగా చిత్రించిన పురందర దాసుని ఫోటోను ఆలయ అర్చకులకు బహూకరించారు.

నారాయణపేట టౌన్ : జిల్లా కేంద్రంలోని పరిమాళపురంలో వెలసిన రాఘవేంద్రస్వామి ఆలయంలో శనివారం పురందాసుల ఆరాధన ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఆలయ అర్చకుడు నరసింహచారి అధ్వర్యంలో వేద మంత్రోచ్ఛణల మధ్య విశేష పూజలను నిర్వహించారు. పళ్ల పుర వీధుల గుండా మీదుగా గోపాల కార్యక్రమం చేపడుతూ, కార్యకరమంలో రాఘవేంద్ర సేవా సమితి సభ్యులు విద్వాన్, ముంబై హరీషాచారి, విద్వాన్ ప్రహల్లాద, నరసింహ, ప్రకాశ్, ప్రసాద్, రాఘవేంద్రరావు, సీతారాం దీక్షిత్, ధరణిధర దీక్షిత్, అనంతరావు, మంజునాథ్ జోషి, రఘునాథ్, శ్రీహరిపాల్గొన్నారు.

నారాయణపేట రూరల్ : శబరిమలకు పాద యాత్ర చేస్తూ దర్శనానికి వెళ్ళిన అయ్యప్ప మాలాధారుడు బట్టి వెంకటేష్‌కు శనివారం స్థానిక ఆలయంలో శాలువాతో సన్మానం చేశారు. కార్యక్రమంలో మనోహర్‌గౌడ్, శేఖర్‌రెడ్డి, సకిరప్ప, మహిపాల్‌రెడ్డి, కేశవ్, వసంత్ పాల్గొన్నారు.

నర్వ: అమావాస్యను పురస్కరించుకుని మండల కేంద్రంలోని ఉమామహేశ్వరస్వామి పల్లకీ సేవా కార్యక్రమాన్ని శివ మాలాధారులు, భక్తులు చేపట్టారు. అంతకు ముందు ఆలయంలో అర్చకులు సిద్దయ్య పరమేశ్వరునికి ప్రత్యేక పూజలు, బిల్వాష్టకం, లింగాష్టకం, బిల్వార్చన నిర్వహించారు. అనంతరం పల్లకిలో స్వామి వారి చిత్రపటాన్ని ఉంచి భక్తి పాటలతో భజనలు, డోలు వాయిద్యాలతో పల్లకీసేవ ఊరేగింపు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కేఎస్పీ కాల్వలకు మరమ్మతు చేయాలి



కాలువలో పెరిగిన ముళ్లచెట్లు

మరికల్: కోయిల్‌సాగర్ లింక్ కెనాల్ కాలువలో ముళ్లచెట్లు నిండిపోయాయని రైతులు అంటున్నారు. అయినప్పటికీ ఎవరూ పట్టించుకోకపోవడంతో మరమ్మతులకు నోచుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. తీలేర్ పంపుహౌస్ నుంచి కంసాన్‌పల్లి వరకు కాలువ మొత్తం ముళ్లచెట్లు, పిచ్చిమొక్కలతో నిండి ఉండటం వల్ల వర్షాకాలంలో కాలువకు గండ్లు పడే అవకాశం ఉందని అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కోయిల్ సాగర్ ప్రధాన కాల్వలతో పాటు పిల్ల కాల్వలకు మరమ్మతులు చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

ఘనంగా అంబిగర చౌడయ్య జయంతి



అంబిగర చౌడయ్య జయంతి వేడుకల్లో పాల్గొన్న యువకులు

కృష్ణా: మండలంలోని హిందుపూర్, తంగిడి గ్రామాల్లో శనివారం నిజశరణ అంబిగర చౌడయ్య 903వ జయంతి ఉత్సవాలను యువకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ కూడలిలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. యువజన నాయకుడు రవికుమార్ చౌడయ్య సమాజంలోని అసమానతలు తొలగించేందుకు విశేష కృషి చేశారని, ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గౌరిశంకర్, మల్లేష్, అంబ్రేష్, శంభర్, మంజునాథ్, భీమ్, మహేష్ ,జుక్కప్ప, తంగిడి నర్సింగా, బస్సయ్యస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మాక్ పోలింగ్



ఓటు వేయడానికి లైన్‌లో నిల్చున్న విద్యార్థులు



ఓటు వేస్తున్న విద్యార్థి

- ఎన్నికలను తలపించేలా ప్రచారం, బ్యాలెట్ తయారీ, ఓటింగ్

కోస్గి: కొత్త మండలం గుండుమాల్‌లోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మాక్‌పోలింగ్ ఆకట్టుకుంది. ఎన్నికలు ముందుగానే జరుగుతున్నాయా? అన్నట్లు సందడి నెలకొంది. విద్యార్థులకు ఎన్నికల పట్ల అవగాహన కల్పించేందుకు గణతంత్ర దినోత్సవ వేడుకలు, జాతీయ ఓటర్ దినోత్సవాలను పురస్కరించుకుని కార్యక్రమం నిర్వహించారు. నిజమైన ఎన్నికల్ని తలపించేలా పోటీలో ఉన్న అభ్యర్థులు ప్రచారం నిర్వహించగా ముద్రించిన బ్యాలెట్‌లో ఓటింగ్ నిర్వహించారు. ఇందులో ఓటింగ్ స్లిప్పుల పంపిణీ, ఎన్నికల నిర్వహణ అధికారులు, రహస్య ఓటింగ్, కౌటింగ్ నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ఆలయాభివృద్ధికి చర్యలు తీసుకోవాలి



విలేకర్లతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కోస్గి: పట్టణ నడిబొడ్డున ఉన్న వేణుగోపాల స్వామి ఆలయానికి రూ. కోట్ల విలువైన భూములు, ఆస్తులు ఉన్నప్పటికీ ఆలయం అభివృద్ధికి నోచుకోవడం లేదని, ఎండోమెంట్ అధికారులు ఆలయాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ గతంలో గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో ఆలయానికి చెందిన 400 గజాల స్థలంలో అప్పటి ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి తన సీడీపీ నిధుల నుంచి రూ. 5లక్షలు కేటాయించి అభివృద్ధికి చేయూతనిచ్చారని, ప్రస్తుత పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. ఈ విషయంలో తగిన చర్యలు తీసుకోని పక్షంలో మున్సిపల్ కార్యాలయం ముందు భక్తులతో కలిసి ధర్నా చేస్తామన్నారు. ఇందులో టీపీసీసీ మెంబర్ వార్ల విజయ్ కుమార్, పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు బెజ్జు రాములు, నాయకులు నాగులపల్లి నరేందర్, కూర ప్రభు, రమేష్‌రెడ్డి, శివరాజ, ఫరీద్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

వానరంతో తంటాలు



బసిరెడ్డిపల్లిలోని ప్రకృతి వనంలో వానరం

నారాయణపేట రూరల్ : మండలంలోని అమ్మిరెడ్డిపల్లి పంచాయతీ పరిధిలోని బసిరెడ్డిపల్లిలో ఓ వానరం గ్రామస్తులను తీవ్రంగా ఇబ్బందులు పెడుతోంది. పక్షం రోజుల క్రితం నుంచి పల్లె ప్రకృతివనంలోని చెట్లపై సేదతీరుతూ ఉదయం వేళల్లో వీధుల్లో తిరుగుతూ పిల్లలు, మహిళలపై దాడి చేస్తోందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటి వరకు 15మందికి పైగానే వానరం చేతిలో గాయపడ్డట్లు పేర్కొంటున్నారు. పక్కనే ప్రభుత్వ పాఠశాల ఉండటంతో విద్యార్థుల చేతిలో ఏదైనా వస్తువు, బ్యాగు కనిపిస్తే చాలు వారిపైకి వచ్చేస్తోందంటున్నారు. ఇక మధ్యాహ్న భోజన సమయంలో అయితే బాధలు వర్ణణాతీతమని వాపోతున్నారు. ఇప్పటికే ఎనిమిది మంది చిన్నారులను గాయపర్చిందని చెబుతున్నారు. కాగా అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇస్తే.. కోతులను బంధించే పరికరాలు లేవని, వాటిని పట్టుకునే ప్రైవేటు వ్యక్తికి సంబంధించిన సెల్ నెంబర్ ఇచ్చి చేతులు దులుపుకున్నారని చెబుతున్నారు. కాగా సదరు వ్యక్తికి ఫోన్ చేస్తే రూ.30 నుంచి రూ.40వేలు డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది.

విద్యార్థుల హాజరు తప్పనిసరి



సమావేశంలో మాట్లాడతున్న ఎంపీటీసీ

నర్వ: విద్యార్థులు పాఠశాలలో హాజరు తప్పనిసరిగా చూడాల్సిన బాధ్యత తల్లితండ్రులదేనని హెచ్ఎం మౌనిక అన్నారు. శనివారం జంగంరెడ్డిపల్లిలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యనారాయణరెడ్డి, సర్పంచు రాములు, గ్రామస్థులు భగవంతు, రాజేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలంలోని నిడుగుర్తి, పెద్దపొర్ల, పులిమామిడి తదితర పాఠశాలలో శనివారం విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాభివృద్ధికి కృషి చేద్దామని సర్పంచ్ యశోదమ్మ అన్నారు. పెద్ద పొర్ల పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు సరిపడా ఉపాధ్యాయులు లేరని పలువురు తల్లిదండ్రులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాఘవరెడ్డి, ప్రధానోపాధ్యాయులు లక్ష్మారెడ్డి, కళావతి, రాజశ్రీ, ఎస్ఎంసీ చైర్మెన్ నరహరి తదితరులు పాల్గొన్నారు.